క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని నెహ్రూ చౌక్ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించే ప్రధాన పైపులైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. నెహ్రూ విగ్రహం వద్ద ఈ పైపులైన్ పగిలిపోయి నీళ్లన్నీ వృథాగా పోతుండటంతో స్థానికుల ఫిర్యాదుల మేరకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాలతో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని పిలిపించి పనులు చేయించి నీటి వృథాను అరికట్టారు. మున్సిపల్ ఏఈ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరునికి సదస్యం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న శ్రీవాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారికి సదస్యం, సప్తకలశ స్నాపన, మహా నివేదన కార్యక్రమాలను అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో శేష వాహనంపై ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యుడు శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.23,800 విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం ఏలూరు జిల్లా నూజివీడు పట్టణానికి చెందిన ఉప్పుగుండ్ల మహేష్‌బాబు కుటుంబ సభ్యులు వెంకట శివకుమార్ పేరు మీద రూ.23,800 ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

11న వాలీబాల్ పోటీలు

జి.కొండూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి రెండు రోజులపాటు జి.కొండూరు జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో భాగంగా తయారు చేసిన ప్రచార వాల్‌పోస్టర్లను ఎస్సై ధర్మరాజు చేతులమీదుగా శనివారం విడుదల చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలతో పాటు అంబేడ్కర్ జీవితచరిత్రపై పాఠశాల స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

వెలదికొత్తపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వెలదికొత్తపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగామటౌన్: జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామంలో సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలను అడిగి వారి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం గృహ యజమాని అనుమతితో ఇంటి గోడకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అంటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగనన్న సైనికులు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను, మంచిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు.

ప్రజలిచ్చిన విశ్వాసంతోనే...

ప్రజలిచ్చిన విశ్వాసంతోనే జగనన్నే మా భవిష్యత్తు వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడి అవసరాలు గుర్తించి వాటిని తీర్చటంతో పాటు వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించటమే కాకుండా పల్లెలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ పాలనకు తమ ప్రభుత్వ పాలనకు తేడా గమనించి మంచి చేశామనిపిస్తేనే మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ చింతోటి వీర ప్రసాద్, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు గుడేటి నాగమల్లేశ్వరి, నాయకులు వంకాయలపాటి భాను, శ్రీను, పృథ్వీరావు, సత్యనారాయణ, గృహ సారథులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు నిర్వహించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను వారి ఇంటి గోడలపై అంటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని వివరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ కోటి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, నాయకులు పూలా పుల్లయ్య, రమావత్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న జగనన్నే మా భవిష్యత్తు

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు ఉత్సాహంగా ఇళ్లకు తిరుగుతూ పథకాలను వివరిస్తున్నారు. గౌరవరం, చిల్లకల్లు, అన్నవరం, పోచంపల్లి గ్రామాల్లో శనివారం గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ఫోన్‌లకు, ఇళ్లకు స్టిక్కర్‌లు అంటించి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ డి.జానకిరామయ్య, సర్పంచ్‌లు మీగడ వెంకటేశ్వర్లు, బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, జగదీష్, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్న అంటే ఒక భరోసా

నందిగామ: పట్టణంలోని నాలుగవ వార్డులో శనివారం జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల అమలుపై అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ మారం అమరయ్య తదితరులు మాట్లాడుతూ ప్రజల్లో జగనన్న అంటే ఒక నమ్మకం, భరోసా ఉన్నాయని, ప్రతి గడపలో తమకు మంచి ఆదరణ లభించిందని చెప్పారు. ప్రభుత్వంపై ప్రజలకి ఉన్న నమ్మకాన్ని వారు స్వయంగా తెలియజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: కంచికచర్ల అరుంధతీనగర్‌లో, మండలంలోని పెండ్యాల గ్రామంలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేని పనులన్నీ మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలంతా తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, వేమా రోజారమణి, దేవరకొండ గురవయ్య, లగడపాటి నాగేశ్వరరావు, పరిటాల రాము, తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి రాష్ట్ర ప్రజలకు ధైర్యంగా చెప్పే కార్యక్రమమే జగనన్నే మా భవిష్యత్తు అని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వివరించటంతో పాటు ప్రజల మద్దతు తీసుకుంటూ ముందుకు సాగారు. గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తేడాను గమనించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, సుబ్బాయిగూడెం సర్పంచ్‌లు కూచి నర్సయ్య, పాపినేని వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నర్సయ్య, ఎస్సీసెల్ కన్వీనర్ జక్కులూరి దేవదాసు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని పెనుగంచిప్రోలులో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, అనిగండ్లపాడులో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, ముండ్లపాడులో సర్పంచ్ గూడపాటి లావణ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేటలో జగనన్నే మా భవిష్యత్‌కు అనూహ్య స్పందన

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిషత్ కార్యక్రమానికి ప్రజల్లో అనూహ్య స్పందన లభిస్తోంది. కార్యక్రమంలో రెండవ రోజు పట్టణంలోని 6వ నంబరు సచివాలయం పరిధిలో గల 16 వ వార్డులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ తన్నీరు నాగమణి పాల్గొన్నారు.10 వ నంబరు సచివాలయం పరిధిలోని 20వ వార్డులో ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చైతన్యశర్మ, నవకళ సురేష్, బ్రహ్మం పాల్గొన్నారు. 18 వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జుజ్జూరులో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెండ్యాలలో వలంటీర్లు, గృహసారథులతో కలసి ప్రభుత్వ పథకాల గూర్చి వివరిస్తున్న నాయకులు



పొన్నవరం గ్రామంలో పాల్గొన్న ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి, తదితరులు



పేట16వ వార్డులో పాల్గొన్న పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ తన్నీరు నాగమణి తదితరులు

మంచి మనసున్న పాలనాదక్షుడు

- వెలదికొత్తపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం
- సంక్షేమ పథకాలు వివరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వెలదికొత్తపాలెంలో గడపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసున్న దార్శనికుడు, పరిపాలనా దక్షుడని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. గడపగడపకు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్నారన్నారు. సాహసోపేత నిర్ణయాలు, కనివినీ ఎరుగని సంక్షేమ పథకాలతో యావత్ దేశం రాష్ట్రం వైపు చూసేలా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ చింతోటి వీర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు గుడేటి నాగమల్లేశ్వరి, నాయకులు కొల్లి హనుమంతరావు, పృథ్వీరావు, చింతోటి సత్యనారాయణ, వంకాయలపాటి భాను, శ్రీను, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై లైంగిక దాడి

నందిగామ: వృద్ధురాలిపై ఇరవై ఏళ్ల యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామలో శనివారం జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం ప్రకారం .. నందిగామ పట్టణానికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు రోజూ మాదిరిగానే పశువులను మేపేందుకు పొలానికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న ఆ వృద్ధురాలిపై మేకలు కాసుకునే గోపి అనే యువకుడు మద్యం మత్తులో దాడి చేయడంతో పాటు, లైంగిక దాడికి పాల్పడ్డాడు. సమీప పొలాల్లో ఉన్న కొందరు దానిని గమనించి ఆ యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. స్పృహ కోల్పోయి ఉన్న ఆ వృద్ధురాలిని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో విజయవాడకు తరలించారు. దీనిపై ఎస్‌హెచ్‌ఓ సతీష్‌ను వివరణ కోరగా ఘటనపై పూర్తి వివరాలు రావలసి ఉందన్నారు.

సాహితీ, కళారంగాల వేదిక విజయవాడ

విజయవాడకల్చరల్: సాహితీ, కళా రంగాల వేదిక విజయవాడ అని హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. గాంధీనగర్‌లో ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన హనుమంతరాయ గ్రంథాలయ కళావేదిక ప్రారంభోత్సవానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.30 లక్షలతో ఆడిటోరియాన్ని ఆధునీకరించి, కళాకారులకు కళాసంస్థలకు అందుబాటులోకి తీసువచ్చామన్నారు. గ్రంథాలయానికి, కళావేదికకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. కళావేదికను ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, గ్రంథాలయ ఆధునిక భవనాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావి శారద ప్రారంభించారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

నేడు శ్రీవారి శాంతి కల్యాణం




పూజా కార్యక్రమాలలో భక్తులు

తాటిగుమ్మి(వీరులపాడు): మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ప్రదీప్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, మహా నివేదన, విష్వక్సేనారాధనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామి వారి శాంతి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బెజవాడ నారపరెడ్డి, ఆలయ చైర్మన్ కొండపురెడ్డి వెంకటరామిరెడ్డి, కరుణ తెలిపారు. కల్యాణం అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్నదానానికి వల్లూరి జయేందర్ రెడ్డి, మంగమ్మ దంపతులు రూ.50 వేలు, బెజవాడ చిన్నపరెడ్డి, ఓం నమో శివాయమ్మ దంపతులు రూ.25 వేలు, బెజవాడ రవీంద్రరెడ్డి, లక్ష్మి రూ.25 వేలు, బెజవాడ రామకృష్ణారెడ్డి దంపతులు రూ.25 వేలు విరాళంగా అందించారని చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.

కంచికచర్ల మసీదు అభివృద్ధికి రూ.50 వేలు వితరణ

కమిటీ పెద్దలకు అందజేసిన ఎమ్మెల్సీ రుహుల్లా



కంచికచర్ల మసీద్ కమిటీ పెద్దలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మసీదుల అభివృద్ధికి కృషిచేస్తోందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. కంచికచర్లలోని మసీద్ కమిటీ పెద్దలు శనివారం ఎమ్మెల్సీ రుహుల్లాను సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో కలిశారు. రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనలు, ఇఫ్తార్ విందుకు హాజరుకావాలని ఆయనకు ప్రత్యేక ఆహ్వానాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్సీ ఎండీ కరీమున్నీసా పేరుమీద మసీద్ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్సీ రుహుల్లా రూ.50 వేలను కమిటీ పెద్దలకు అందించారు. మసీద్‌లు, దర్గాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు.

ఘనంగా మారెమ్మ అమ్మవారి గ్రామోత్సవం

పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేల మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకులు, ఈఓ వై.సీతారామయ్య, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్యశేష సునీల్ కుమార్ ఎమ్మెల్యేని సత్కరించి జ్ఞాపికను అందజేసారు. శనివారం మధ్యాహ్నం వరకు గ్రామోత్సవం కొనసాగింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, గ్రామ ప్రముఖుడు బొల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ కారుమంచి స్వాతి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, విస్సన్నపేట సర్పంచ్ నాగమల్లేశ్వరి, గృహసారథుల మండల కన్వీనర్‌శివబాజీ పాల్గొన్నారు.

బీసీ నేతకు అధ్యక్ష పదవి ఇవ్వడంపై హర్షం



వైఎస్సార్ సీపీ పేట మండల అధ్యక్షుడిగా నియమితులైన బీసీ నేత శ్రీనివాసగౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘాల నేతలు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట మండల కమిటీ అధ్యక్షుడిగా బీసీ సంఘం సీనియర్ నాయకుడు మండవ శ్రీనివాసగౌడ్ నియామకంపై బీసీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక చెరువుబజారులోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో బీసీ సంఘాల నేతలు మండవ శ్రీనివాసగౌడ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాసగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తూమాటి కృష్ణమాచారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బీసీల సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలేల భావజాలంతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు..బ్యాక్ బోన్ అని కార్యరూపంలో చేసి చూపించారని అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను గత ప్రభుత్వాలలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. అందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు పోలంపల్లి రాధమ్మ, దేవరకొండ శ్రీను, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, చాపల వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, మార్తి రమేష్, అల్లి శివకుమారి, మునిహేరా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పనితీరును వివరించాలి

వత్సవాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పనితీరును ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు తెలిపారు. వత్సవాయి, పెంట్యాలవారిగూడెం, మక్కపేట గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి ఇంటింటికీ తిరిగి గత టీడీపీ ప్రభుత్వం చేసిన పనులు ప్రస్తుతం వైఎస్సార్ సీపీ చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరును గమనించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే పథకాలు చేరుతున్నాయని, గతంలో ఏ ప్రభుత్వం ఇలా నేరుగా లబ్ధిదారుడికి అందించలేదని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, భూక్యా రాజానాయక్, ఉపసర్పంచ్ చింతల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.